🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 16 | 16-01-2023 | పుటలు : 4

## నన్నయ వీసీగా ప్రసాదరాజు బాధ్యతలు

**09.01.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ వీసీ గా జే.ఎన్.టీ.యూ.కె ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు నియమితులయ్యారు. దీనిలో భాగంగా సోమవారం నన్నయ విశ్వవిద్యాలయంలో ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు వీసీ(ఎఫ్.ఎ.సి)గా బాధ్యతలను స్వీకరించారు. వీసీ ప్రసాదరాజు శ్రీమతి అరుణ దంపతులకు ఎన్.సి.సి విద్యార్థుల గార్డ్ ఆఫ్ ఆనర్ మరియు పూరోహితుల పూర్ణకుంభాలతో ఘనంగా స్వాగతం పలికారు. వీసీ కార్యాలయంలో వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరాజుకు నన్నయ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు, మిత్రులు శుభాకాంక్షలు తెలియజేసారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని భవనాలను వీసీ పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ ఈసీ హాల్ లో జరిగిన సమావేశంలో వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ జే.ఎన్.టీ.యూ.కె వీసీ తో పాటు జే.ఎన్.టీ.యూ.కె విజయనగరం మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ గా నియమించినందుకు సిఎం జగన్మోహనరెడ్డికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఉన్నత విద్యాశాఖ కు కృతజ్ఞతలు తెలిపారు. సమష్టిగా పనిచేసి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో పెండింగ్ లో ఉన్న భవనాలను నిర్మాణం చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన విలువైన సూచనలు, సలహాలను అందించాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంతో ఎంతో అనుబంధ ఉందని చెప్పారు.



నన్నయ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాదరాజు

జె.ఎన్.టీ.యూ.కె వీసీ గా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నన్నయ విశ్వవిద్యాలయం ప్రగతికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, శ్రీమతి అరుణ, మురళికృష్ణ, ఈసీ మెంబర్స్ ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి, డా.కె.సుబ్బారావు, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.కె.నూకరత్నం, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.డి.కళ్యాణి, డా.డి.దీప్తి, సిఈ ఎస్.లింగారెడ్డి, ఎఫ్.ఓ. కె.శ్రీనివాసరావు, ఏ.ఆర్. జి.చంద్రకళ, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సుగుణ, రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల యాజమాన్యాల ప్రతినిధులు మరియు జె.ఎన్.టి.యు.కె. అధికారులు పాల్గొన్నారు.

## నన్నయ అభివృద్ధికి అందరూ కృషిచేయాలి

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యాప్షీ చైర్మన్ హేమచంద్రరెడ్డి

**09.01.23 (మీడియాసెల్)**

విశ్వజనీనమైన ఆలోచనలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి అన్నారు.బుధవారం యాప్షీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వీసీ ఆచార్య జి.వి.ఆర్ ప్రసాదరాజు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో యాప్షీ చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం వచ్చిన తరువాత విద్యాపరమైన మార్పులు ఎన్నో వస్తున్నాయని, నూతన సంస్కరణలు విద్యారంగంలో చూస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందరికీ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్కాలర్షిప్ లు, వేతనాలు మరియు విద్యాభివృద్ధికి సంబంధించి వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని దీనిలో భాగంగా ఇంటర్న్షిప్ లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. దానిని సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు సమాజ విలువలను పెంపొందించేందుకు కేంద్రాలని, వర్సిటీల ఔనత్యాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. వివాదాలను పక్కన పెట్టి విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ వేయేళ్ళ చరిత్ర కలిగిన రాజమహేంద్రవర నగరంలో ఆదికవి నన్నయ పేరుతో నడపబడుతున్న నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. విశ్వవిద్యాలయ అవిర్భావానికి, అభివృద్ధికి అనేక మంది కృషి చేసారని, విశ్వవిద్యాలయాన్ని మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో లక్షకు పైగా ఉన్న విద్యార్థులకు మరింత సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో నిర్మాణ దశలో ఆగిపోయిన భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ లో బీఫార్మసీ, హాస్టల్ భవనాలను త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన ఉన్నత విద్యను అందరికీ అందించాలనే లక్ష్యంతో పని చేస్తుందని దానికి తగినట్టుగా అధ్యాపకులంతా విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన నూతన ఆలోచనలను తెలియజేయాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది యాప్షీ చైర్మన్ హేమచంద్రారెడ్డిని, వీసీ జి.వి.ఆర్. ప్రసాదరాజును సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



యాప్షీ చైర్మన్, వీసీ లను సన్మానిస్తున్న దృశ్యం



## సంపాదకీయం



# ఇంద్ర ధనుస్సు

*విద్యార్థులారా!!*

జీవితాన్ని రంగులమయం చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది. ప్రతి మనిషి తన జీవితాన్ని, తనను తాను ఉన్నత స్థితికి తీసుకువెళ్లే సామర్థ్యంతోనే కాకుండా సమాజ సమష్టి చైతన్యాన్ని కూడా ఉన్నత స్థితికి తీసుకెళ్లగల శక్తితో ఉంటాడు. సందేహమే లేదు. ఈరోజు అనేది మనకు లభించిన కానుక. దానిని సరైన దినచర్యతో సద్వినియోగం చేసుకోవటమే.

మనం వాహనాన్ని నడపాలనుకున్నప్పుడు రోడ్డుమీద ఉండే ఆటంకాలని, ఇబ్బందుల్ని, ట్రాఫిక్ జామ్ ను భరిస్తున్నాం కదా. చెయ్యలేమనే ఉద్దేశాన్ని కలిగి ఉండటం వలన కొన్ని మనం చెయ్యం. చేయగలం అనే అలవాటుగా మారటానికి కొంత అభ్యాసం కావాలి.ప్రపంచం ఎలా ఉన్నా మనం ఆనందంగా ఉండటం కచ్చితంగా మన చేతుల్లోనే ఉంది. దానికి చేయాల్సింది ప్రపంచాన్ని ఎలా ఉందో అలా స్వీకరించి దానిపట్ల మన పద్ధతిని, వైఖరిని మార్చుకోవటమే.

తెల్ల బట్టలు వేసుకున్న వాళ్ళ మనసు స్వచ్ఛమైందని అర్థం కాదు. అలాగని పూలచొక్కా వేసుకున్నంత మాత్రాన పోకిరి అని కూడా కాదు. కాషాయం కట్టుకున్నంత మాత్రాన ఆధ్యాత్మికవేత్త అని అసలే కాదు. సమగ్ర మూర్తిమత్వం అన్నప్పుడు కేవలం డ్రెస్ మాత్రమే కాదు. మాట, ప్రవర్తన, ఇతరులపట్ల వైఖరి... ఇవన్నీ!

ఈ ప్రపంచం ఎలా ప్రవర్తిస్తుందనేది మనకు సంబంధించిన విషయం కాదు.మన వ్యక్తిత్వంతో మనం జీవించటమే ముఖ్యమైంది. అది ఆత్మాభిమానంతో కావచ్చు. భావోద్రేకాల్ని నియంత్రించుకుంటూ కావచ్చు.సరైన చదువు, దినచర్య, అభ్యాసం ఇవే కదా మనమెదగటానికి గల గొప్ప సూత్రాలు. మరొక విషయం మనకు మనమే అత్యంత విలువైన వనరు. దానిని సద్వినియోగం చేసుకోవటం వల్లనే మనకు ఒక అందమైన ప్రపంచం ఏర్పడుతుంది.మనం సరైన పద్ధతిలో వినియోగించుకుంటున్నామా,లేదా అని ఒకసారి ప్రశ్నించుకోవాలి.

మన పనులకి ఇతరులని వాడుకోవటం కాదు. మనల్ని మనం తగినంతగా వాడుకుంటున్నామా...అని పదేపదే ప్రశ్నించుకోవటం చాలా ముఖ్యమైన పని. మన పరిధి చాలా పెద్దది. దాని నిండా కావలసినంత నింపుకోవచ్చు. మనసులోనికి ఒంపుకోవచ్చు. మన నైపుణ్యాలను మన పరిధినిండా వినియోగించుకున్నప్పుడు ఇంద్రధనుస్సులోని ఏడు రంగులు స్పష్టంగా కనిపిస్తాయి. అవి బయట ఆకాశంలో కాదు. మనలోనే ఉన్నాయనే విషయం అర్థమవుతుంది. ఆ రంగుల ప్రపంచంలో మనమే రారాజు. మనమే విజేత. మనమే గొప్ప వ్యక్తి. మనదే సమగ్రమైన మూర్తిమత్వం.

ముఖ్యంగా విద్యార్థి దశలో అభ్యాసం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటం, విస్తృతమైన అధ్యయనం, నిర్మలమైన మనసు, ఏం అవ్వాలని మనం అనుకుంటున్నామో దాని పట్ల అవగాహన, ముఖ్యంగా సమయపాలన,సరైన వైఖరి, క్రమశిక్షణ ఇదే అంతర్గతమైన ఇంద్రధనస్సు. ఇవే జీవితానికి సంబంధించిన ముఖ్యమైన రంగులు. అటువంటి రంగుల ప్రపంచం లోకి మీరు ప్రయాణించాలి.జయహో!!



# వివేకానంద యువతకు స్ఫూర్తి

**రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్**

'యువత దేశానికి వెన్నెముక,వారు సాధించలేనిదేదీ లేదు' అన్న స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధనలోఅంకిత భావంతో మనమందరం ముందడుగులు వేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో వివేకానంద చిత్రపటానికి విశ్వవిద్యాలయ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వివేకానంద మాటలు, సూక్తులు యువతను జాగృతం చేస్తాయని, నూతన ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు. కెరటం నాకు ఆదర్శం .. లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు వంటి హిత వాక్యాలు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. వివేకానంద వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా నూతన ఆలోచనలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.పి.విజయనిర్మల, సిఈ ఎస్.లింగారెడ్డి, ఎ.ఆర్. జి.చంద్రకళ, ఎఫ్.ఓ. కె.శ్రీనివాసరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు




అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ పోటీలు మరియు యూనివర్సిటీ టీం సెలక్షన్స్ ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రాగణంలో నిర్వహించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుండి 40 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. పది రకాల వెయిట్ కేటగిరీలలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాకినాడ వారు టీమ్ ఛాంపియన్ షిప్ సాధించారు. బెస్ట్ ఉమెన్ వెయిట్ లిఫ్టర్ గా వి.ఎస్.లక్ష్మీ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కాకినాడకు చెందిన పి.ధాత్రి కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన 19 మంది సభ్యులు గల పురుషులు, మహిళలు త్వరలో జరగబోయే ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటారు. ప్రతిభ కనపరచిన క్రీడాకారులను ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి అభినందించి మెడల్స్ అందజేసారు. ఈ కార్యక్రమంలో అర్గనైజింగ్ సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, సెలక్షన్ కమిటీ మెంబర్లు బడేటి వెంకట్రామయ్య, సూరిబాబు, డా.కె.బాలసత్యనారాయణ, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి, దేవానంద్, సిహెచ్. సుబ్రహ్మణ్యం, అన్వర్ బాషా, కోచ్ లు రమేష్, సతీష్, లోహిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావాణి

# శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ

**(1877 - 1958)**

గాంధేయవాది,నవలా సాహిత్య వైతాళికులు,స్వాతంత్ర్యోద్యమ వీరులు, న్యాయవాది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషిచేసిన సంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ. రష్యాలోని బోల్షివిక్ విప్లవం స్పూర్తి పొందిన మొదటి తెలుగు కవి. కూలీల పక్షం వహించి వారి ఆర్థికాభివృద్ధిని కాంక్షించి వారి దుస్థితిని తెలియజేసిన మహా మనిషి.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా వేములూరులో జన్మించారు. గుంటూరులో చదువుకున్నారు. రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఐర్లాండ్ లోని డబ్లింగ్ లో బారిష్టర్ పట్టా పొందారు. మద్రాస్ హైకోర్టులో న్యాయవాద వృత్తి చేపట్టారు. జీవితంతో పాటు మరోవైపు సేవా దృక్పథాన్ని కలిగి యంగ్ మెన్స్ లిటరరీ సొసైటీని, వితంతు శరణాలయాన్ని స్థాపించారు. భార్య లక్ష్మీబాయితో కలిసి గుంటూరులో శారదానికేతన్ స్థాపించి స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశారు. శారదానికేతనంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించిన స్త్రీలంతా వివిధ రంగాల్లో రాణించారు. ఆనాటి ఆంధ్రదేశ మహిళాభ్యుదయంలో శారదానికేతనం విశిష్ట పాత్ర నిర్వహించింది.

స్వరాజ్య పార్టీలో చేరి ఆ పార్టీ ఉపాధ్యక్ష పదవి వరకు ఎదిగారు. నాటి వ్యవస్థలో ఉన్న లోటుపాట్లతో మాలపల్లి నవలను రచించారు. దళితవాడలోని ఒక




కుటుంబానికి సంబంధించిన ఇతివృత్తాన్ని తీసుకొని భూస్వామ్య వ్యవస్థల్లో పాతుకొని ఉన్న పెత్తందారీతనాన్ని నిలుపుకోవడమే గౌరవమని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మరొక కుటుంబాన్ని అందులో భిన్న ప్రవృత్తుల వారిని అంటే మనసున్న మనుషుల్ని,పరువు ప్రతిష్టలు ముఖ్యం అనుకునే వారిని, పవిత్రతకు ఆత్మ ఔన్నత్యానికి ప్రధాన్యాన్ని ఇచ్చే వారిని, జాతి కంటే నీతి ముఖ్యమనుకునే వారిని పాత్రలుగా నిలిపి తెలుగు పలుకుబడితో వ్యవహారిక భాషలో రచించిన నవల " మాలపల్లి "దీనికే సంఘువిజయం అనే పేరు కూడా ఉంది. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది. 1928లో మళ్లీ మాలపల్లి ప్రచురణకు అనుమతి లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ నవలను పాఠ్యగ్రంథంగా కూడా ఎంపిక చేసింది.

జాతీయోద్యమ ప్రభావం నాటి సహాయ నిరాకరణ ఉద్యమం లాంటి విషయాలన్నీ ఈ నవలలో అడుగడుగునా మనకి కనిపిస్తాయి. ఆయన భార్య లక్ష్మీబాయమ్మ గారు నిజమైన సహధర్మచారిణిగా ఖద్దరు ప్రచారం,మహి మహిళాలోకోద్ధరణ, అస్పృశ్యత నిర్మూలనం కోసం కృషి చేశారు. జాతీయోద్యమంలో పాల్గొన్నందుకు వీరు ఇరువురు కారాగార వాసం అనుభవించారు. నిత్య ప్రజాహిత పారాయణంగా సమాజానికి ఉపయోగపడిన జీవితాలు వీరిద్దరివి.ఇటువంటి వారిని స్మరించటం ద్వారా సమాజంలో మన పాత్ర ఏమిటనేది మనం తెలుసుకోవటానికి కారణమవుతూ ఉంటుంది.

**– డా.దామెర వెంకటసూర్యారావు.**

# పౌష్యలక్ష్మీ!!



పుష్యమాస శీతల సమీరమా!
మదిలో మెదిలే సంఘర్షణల్లో
నీవొచ్చి ఎదాడయ్యింది.
సమాజంలో పాతుకుపోయిన
అన్యాయాన్నీ,అక్రమాల్నీ
మాలో పెరిగిపోయిన
అహంకారాన్ని నీచల్లని గాలితో
మంచు బిందువులతో తొలగించి
విప్లవ జ్వాలలను నీ భోగిమంటల
వెలుగుతో వెలిగించి
మాలోని ధర్మజ్యోతుల్ని
సంక్రాంతి కాంతుల వెలుగులో
పంచుతూ తల్లితండ్రులను
వృద్ధాశ్రమాల్లో విడిచి వచ్చే
మా అభివృద్ధిని మాపి
వారిని పర్వదినాన పూజించే
అవకాశాన్ని మాకు కలిగించు.
పశువులను సైతం పూజించే
మా ధార్మికతను మాలో
అంతరించిపోకుండా
మమ్మల్ని నిత్యం
చైతన్యవంతులుగా తీర్చిదిద్ది
మా పిల్లల బొమ్మలు కొలువులతో
ఆనందించి వారి నవ్వుల
వెలుగులో ధర్మ దేవతగా రమ్మని
నీకు స్వాగతం పలుకుతున్నాను.
సంక్రాంతి మిత్రమా స్వాగతం.
అన్నదాతలకు పంట పండించే
ధైర్యాన్నివ్వు.సమాజానికి
సామరస్యంగా బ్రతికే ఓర్పునివ్వు.

**-ఎస్.లావణ్య దేవి**
**ఏం.ఏ(తెలుగు)అనూర్**

## మంచి మాట

### పరోపకారార్థమిదం శరీరం!

ఇతరుల కొరకే చెట్లు పళ్ళనిస్తున్నాయి. నదులు నీటినిస్తున్నాయి. గోవులు పాలనిస్తున్నాయి. ఈ శరీరాలు పరోపకారార్థం కోసం కూడా వినియోగించాలి.

**– భర్తృహరి**


# మాక్సిం గోర్కీ కథలు




సర్వ ప్రపంచం అంటే మానవ సంబంధాల ప్రపంచం. మనిషితనం నిండుకున్న ప్రపంచం. మానవీయశక్తుల్ని అడ్డుకునే ప్రతి శక్తుల మీద విజయం సాధించగలిగే అచ్ఛమైన మానవుల ప్రపంచం. పరస్పర అవగాహనకు అడ్డు తగిలే వాటిని వివిధ జాతుల మధ్య ప్రాంతాల మధ్య అలముకుని కుసంస్కారాన్ని తెగగొట్టగల ప్రపంచం. మరో పితృ స్వామిక భావాలకు పైపైన పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే శక్తులు ఉన్న వాళ్ల ప్రపంచం. సంప్రదాయక నీతి స్థానంలో అపేక్షలను పెంచే ప్రపంచం. సమాజంతో సంబంధాలు లేని వాళ్ళ బ్రతుకుల్ని ఈశాడించుకునే ప్రపంచం. బాధలు భయాలు, కరువులు కాటకాలు లేని ప్రపంచం. ఈ ప్రపంచాన్ని చాటేవే ఈ సంపుటలోని కథలు కూడా.

గోర్కీ రచనా కాలం నాటి రష్యన్ సామాజిక సందర్భం,సాహిత్య వాతావరణం మన సమాజంలో యధాతథంగా లేకపోవచ్చు. కానీ కోట్లమంది వంచితులు, అభాగ్యులు, నిరుపేదలు, వలస పక్షులు, శ్రామికులు ఉన్న దేశంలో కనీసం జాతీయ సంపదలో పది శాతం అయినా దక్కని దేశంలో సమాజాన్ని పట్టిపీడించే సమస్యల పైన ఆలోచించ వలసిందిగా ఈ కథలు మనల్ని కుదిపేస్తాయి. గోర్కి రచనల అవసరం ఇప్పుడు ఎందుకో తెలిసి వస్తుంది కూడా.

పది కథలున్న ఈ పుస్తకాన్ని కె.కేశవరెడ్డి గారు అనువాదం చేశారు. మన చుట్టూ ఉన్న వాతావరణం ఈ కథలలో ప్రత్యక్షమవుతుంది. కథలోని పాత్రల పేర్లు మినహాయిస్తే అనువాదకుడు వీలైనంతవరకు పేర్లతో సంబంధం లేని కథలు పేర్లు తప్పనిసరి అయిన కథల్లో మన సమాజానికి అనువైన పేర్లను వాడు కున్నారు. గోర్కి సాహిత్యాన్ని ప్రజలకు అత్యంత చేరువ చేయడానికే ఈ మార్పులు చేశారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఈ పుస్తకాన్ని మనకు అందుబాటులోకి తీసుకొని వచ్చింది. మనిషి తన ప్రయత్నంతోనే ఎదగగలడనీ సమగ్ర మానవునిగా రూపొందిం చాలనీ తన కథలో గోర్కి కళాత్మకంగా మనిషిని చిత్రించారు. సమగ్రమైన మనిషిని గోర్కీ తన మనోనేత్రంతో సందర్శించి వానికి కళారూపం ఇచ్చాడు. గోర్కీ సాంస్కృతిక విప్లవ సేనా నాయకుడు అని చెప్పొచ్చు. సూటిగా హృదయం లోకిసుకుపోయి,మనసులో ఆలోచన తరంగాలు రేపే గోర్కి కథల్ని పుస్తక ప్రియులు, అభిమానులు తప్పనిసరిగా చదవాల్సిందే!



# సమ్యక్ క్రాంతి... సంక్రాంతి



'సం' అనే ఉపసర్గ 'కాంతి' అనే పదం కలసి ఏర్పడినదే సంక్రాంతి.క్రాంతి,సంక్రమణం పర్యాయపదాలు.ఒక స్థానాన్నుండి మరొక స్థానానికి వెళ్ళటం.ఒకటి మరొకటితో కలవటం. సూర్యుడు మకర రాశిలోనికి ప్రవేశించటం మకర సంక్రాంతి. భూమి సూర్యుని చుట్టూ ప్రదక్షిణ చేస్తుంది ఇది ఒక సౌర సంవత్సరం. చంద్రుడు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉంటాడు ఈ కాలం ఒక చాంద్రమాసం. సౌరమానంలో మకర సంక్రాంతి నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. మకర సంక్రాంతి నాటికి రైతులు ఇంటికి కొత్త ధాన్యం వస్తుంది. అందుకనే పులగం వండుతారు.

మల్లికాసుల వారనబడే మల్లికార్జున భక్తులు భ్రమరాంబ మల్లికార్జునులను పెట్టెలలో ఉంచి స్టాండ్ వంటి అరపలపై పెట్టుకొని జంగములు గంటలు మ్రోగిస్తూ శైవ గీతాల్ని గానంచేస్తూ మేలుకొలుపులు పాడుతారు. బుడబుక్కలవారు అంబ పలుకు జగదంబ పలుకు అంటూ అమ్మవారిని కీర్తిస్తూ సంచరిస్తారు. వీరందరినీ శివ భక్తులు, శాక్తేయులు గా గమనించాలి. యాచకులుగా భావించకూడదనేది సమాజ ధర్మం.

ముఖ్యంగా రైతులకు సంబంధించిన పండుగ సంక్రాంతి. పశువులు, పంటల పండుగ, పెద్దల పండుగ కలిస్తే పెద్ద పండుగ. మంచుతెరలు,చలిమంటలు, గంగిరెద్దులు, కొత్త ధాన్యం, కొత్త బట్టలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, భోగిపళ్ళు, ముగ్గులు, బొమ్మల కొలువులు... ఇవన్నీ కలసి సంక్రాంతి మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. ఒక నెల వ్యవధిలో సమాజం క్రిస్మస్ పండుగ లోంచి, ఆంగ్ల నూతన సంవత్సరంలోకి,ధనుర్మాసంలోంచి సంక్రాంతికి....ఇలా అన్ని వర్గాల వారు పండుగ వాతావరణంలో హుషారుగా ఉంటూ కనిపిస్తారు. ఇదే చైతన్యానికి ప్రతీక.ఇదే సంక్రమణం. ఒక కొత్త కాంతి.

పంట పొలాల్లో శ్రమించిన రైతుల కష్టానికి తగిన ఫలితంగా ధాన్యం దిగుబడులు పంట కళ్లాలలో కళకళలాడుతుంటే రైతుల ముఖాల్లో ఒక కాంతి తలుక్కున మెరుస్తుంది. అదే ఆ వెలుగు పేరే సంక్రాంతి.



సంక్రాంతి ప్రధానంగా మూడు రోజుల పండుగ. మొదటి రోజు భోగి. రెండవ రోజు సంక్రాంతి. మూడవ రోజు కనుమ. ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి గోదాదేవి శ్రీరంగనాధుని పెళ్లి చేసుకుని సకల భోగాలను అందుకున్నది ఈ రోజు కాబట్టి సంక్రాంతి రోజున భోగి పండుగ చేసుకుంటారు.

పంట పొలాల్లో వర్షాకాలంలో పడిపోయిన చెట్లను, కొమ్మలను, పాత సామగ్రిని, పురుగు పుచ్చడానికి ఆస్కారమున్న రద్దును ఒక్క చోటికి చేర్చి తగులబెట్టడం భోగి మంటలు.

తమకున్న సంపదలో కొంత దానధర్మాలకు ఉపయోగించటం పండుగల పరమార్థం.అది ఏ పండుగైనా, ఏ మత ధర్మానికైనా ఇది వర్తిస్తుంది.మనిషి ఎప్పుడూ గతంలోకి తొంగి చూస్తూనే ఉంటాడు.వర్తమానాన్ని అందంగా మల్చుకోవటంకోసం గతంలోనికి ఒక సారి తొంగి చూడటం చరిత్ర. వెనుకటి తరాల పండుగ వేడుకలను, ఆచారాలను, సంప్రదాయాలను పునర్నిర్మించి ఆనందించాలనే ప్రతి మనిషి అనుకుంటాడు.

మనిషి ప్రకృతిలో కేవలం చిన్న భాగం మాత్రమే. కొండకోనల్లో పక్షులతో, నదులతో, జంతువులతో కలసి జీవించిన మనిషి మేధస్సు విజృంభించి ఆకాశాన్ని భూగోళాన్ని దాటి విస్తరించిన విధానం పుస్తకాల్లో గమనించాం. మనిషి చాలా ఎదిగాడు. ప్రకృతికి దూరమయ్యే అంతగా!!







జలపాతాన్ని, పురివిప్పిన నెమలిని, అందంతో కనిపించే ఇంద్రధనుస్సు ను చూసి ఆనందించే స్థితిని కోల్పోతున్న డెమో మనిషి. మన పండుగలు, పరమార్థాలు, ఆధ్యాత్మిక విషయాలు,మత ధర్మాలు, సంస్కృతి మనిషిని ప్రకృతికి దగ్గరగా,ప్రశాంతంగా, నిర్మలంగా, నిజాయితీగా జీవించడం కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటాయి. ఒక్కసారి ప్రకృతిలోకి వెళ్ళమనే మనకు సంక్రాంతి ఇస్తున్న సందేశం!!

- ఎడిటర్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in